నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
కర్నూలు | నంద్యాల
మంగళవారం | 28 మే 2024 పేజీలు 8

ఓట్ల లెక్కింపు

# ప్రతిష్ఠ ప్రణాళిక

◆ నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు



వీడియో కాన్ఫిరెన్స్‌లో జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :**

వచ్చే నెల 4న చేపట్టనున్న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పక్కా ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీనివాసులు కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి రాజీవ్‌కుమార్‌కు నివేదించారు. ఢిల్లీ కేంద్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుంచి సోమవారం ఎన్నికల అధికారులు జ్ఞానేష్ కుమార్, డా. సుబ్రిర్ సింగ్, కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి రాజీవ్‌కుమార్, వివిధ రాష్ట్రాల ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా ఎన్నికల ఓట్ల కౌంటింగ్ ప్రక్రియపై దిశ, నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రాజీవ్‌కుమార్ మాట్లాడుతూ జూన్ 4న ఓట్ల

మిగతా 2లో

# శిథిల కాలువలు

◆ దెబ్బతిన్న కేసీ ప్రధాన కాలువ లైనింగ్
◆ చివరి ఆయకట్టుకు అందని సాగునీరు
◆ నిధుల గ్రహణంతో ఆగిన పనులు
◆ ఆరుతడి పంటలపైనే రైతుల ఆశలు



చాగలమర్రి సమీపంలో దెబ్బతిన్న కేసీ ప్రధాన కాలువ లైనింగ్

**చాగలమర్రి, మేజర్‌న్యూస్ :**

కేసి పంట కాలువలు శిథిలావస్థకు చేరాయి. నిధుల గ్రహణంతో పనులు ఆగిపోయాయి. ఫలితంగా చివరి ఆయ కట్టుకు చుక్క నీరు పారని దుస్థితి నెలకొంది. దీంతో రైతాంగం ఆరుతడి వంటలపైనే దృష్టి సారించాల్సిన అగత్యం ఏర్పడింది. మూడేళ్ల నుంచి నిధులు కేటాయించకపోవడంతో పనులు చేపట్టడం లేదు. ప్రతి ఏడాది నామమాత్రంగా పనులు చేసి అధికారులు చేతులు దులుపు కుంటున్నారు. బిల్లులు రాకపోవడంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

ఆళ్లగడ్డ సడి డివిజన్లో కేసీ కాలువ 177 కి.మీ. నుంచి 284 కి.మీ. వరకు ఉంది. ఈ

మిగతా 2లో

ఓట్ల లెక్కింపును

# విజయవంతం చేయాలి

◆ ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్‌జి.సృజన

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:**

వచ్చే నెల 4వతేదీన జరుగనునున ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు పటిష్టంగా చేసుకోవాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్ ఆదేశించారు. ఎన్నికల ఫలితాల ప్రకటన విషయంలో ఏ మాత్రం జాప్యం చేయకుండా భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ త్వరితగతిన ఖచ్చితమైన ఫలితాలను ప్రకటించాలన్నారు. ఐదు దశల్లో ఎన్నికలు జరిగిన రాష్ట్రాల సీఈవోలు, జిల్లా ఎన్నికల అధికారులతో ఎలక్షన్ కమిషనర్లు జ్ఞానేష్‌కుమార్, సుఖ్బీర్‌సింగ్‌సందులతో కలిసి సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఓట్ల లెక్కింపు చేస్తున్న ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశలవారీగా దేశవ్యాప్తంగా జరుగుచున్న సార్వత్రిక ఎన్నికలను అందరి సమిష్టి కృషితో ఎంతో విజయవంతంగా జరుగుతున్నాయన్నారు. అదే స్ఫూర్తితో ఓట్ల లెక్కింపు విజయవంతం చేయాలన్నారు. పవర్ బ్యాక్అప్, ఫైర్‌సేఫ్టీ పరికరాలను సిద్ధంగా

మిగతా 2లో

రెస్టారెంట్ల ఫుడ్...

# జీవితానికి బెడ్ రెస్ట్

◆ ఫుడ్ పాయిజన్‌తో జనాలు
◆ ఆన్‌లైన్‌లో ఆర్డర్లు పెడితే అంతే గతి
◆ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న యాజమాన్యం
◆ షీ ఫుడ్... డేంజర్ బెల్
◆ టేస్టింగ్ సాల్ట్‌తో క్యాన్సర్ కణాలు ఉత్పత్తి
◆ మన ఇంటి వంట మనకే ముద్దు

**ఎమ్మిగనూరు ప్రతినిధి, మేజర్ న్యూస్ :**



పట్టణాలనొద్దు.. పల్లెలు అనికూడా చెప్పకు.. రహదారులు అనద్దు.. గల్లీ దారులైన అంతా మాదేసామ్రాజ్యం.. పుట్టగొడుగుల రెస్టారెంట్లు ఏర్పాటు చేసుకుంటున్నాం.. ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్నాం..



అంటూ దిన దినాభివృద్ధి గా అడుగులేస్తూ రెస్టారెంట్లు ఏర్పాటు చేసుకుంటు న్నారు,. యాజమాన్యాలు ఎక్కడోవుంటారు .. వాటిపనితీరు ఎలా ఉందొ తెలీదు.. అందమైనా సెట్టింగ్..

మిగతా 7లో

డివైడర్ను ఢీకొని

# ఆర్టీసీ బస్సు బోల్తా

◆ 15 మందికి గాయాలు.. కండక్టర్ కు సీరియస్



**కర్నూల్ క్రైమ్ మేజర్ న్యూస్ :**

నగర శివారులోని పెద్దపాడు దగ్గర్లో ఉన్న డ్రైవర్స్ కాలనీ వద్ద కర్నూల్ 1డిపో కు చెందిన ఆర్టీసీ బస్సు డివైడర్ ను ఢీకొని బోల్తా పడింది. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో ఎమ్మిగనూరు నుంచి కర్నూలుకు వస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్స్ కాలనీ వద్ద బస్సు డ్రైవర్ రసూల్

మిగతా 2లో

చెరువులో మట్టిని

# తోడేస్తున్నారు

◆ బండి ఆత్మకూరు చిన్న చెరువులో తవ్వకాలు
◆ చెరువుకట్ట ధ్వంసం, నిద్రావస్థలో మైనర్ ఇరిగేషన్ అధికారులు
◆ తూతూమంత్రంగా రెవెన్యూ అధికారుల చర్యలు



చెరువు కట్టను ధ్వంసం చేసిన అక్రమార్కులు

**బండిఆత్మకూరు, రూరల్ మేజర్‌న్యూస్ :**

బండిఆత్మకూరు చిన్నచెరువులో సోమవారం అక్రమంగా తవ్వకాలు నిర్వహించారు. ఎరుకల కాలనీలో సమీపాన ఉన్న చెరువులో అక్రమార్కులు చెరువు కట్టను ట్రాక్టర్లు రవాణా జరగడానికి వీలుగా ధ్వంసం చేశారు. సోమవారం ఉదయం నుండే చెరువులో జేసీబీ ద్వారా అక్రమ తవ్వకాలకు తెర లేపారు. ఎటువంటి పర్మిషన్ లేకుండా ఇష్టాను సారంగా చెరువు మట్టిని తరలించారు. తరువాత చెరువుతో పాటు చెరువుకు నీరు వచ్చే కాలువలో తవ్వకాలు చేపట్టారు. ఇంత జరుగుతున్నా మైనర్ ఇరిగేషన్ అధికారులు కనీసం చెరువు వైపు చూడకపోవడంతో ప్రజలలో పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సాయంత్రం ఫోన్ ద్వారా మైనర్ ఇరిగేషన్ ఏఈని

మిగతా 2లో

సూర్య
మంగళవారం | 28 మే 2024

## ఓట్ల లెక్కింపుకు పటిష్ట ప్రణాళిక

(మొదటిపేజీ తరువాయి)

లెక్కింపు కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పటిష్టమైన ప్రణాళికతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎటువంటి సమస్యలు లేకుండా పోలింగ్ నిర్వహించిన ఎన్నికల సిబ్బందిని ఆయన అభినందించారు. అదే స్ఫూర్తితో కౌంటింగ్ ప్రక్రియ ప్రణాళిక సిద్ధం చేసుకొని అమలు చేయాలన్నారు. సిబ్బందికి పూర్తి స్థాయిలో శిక్షణ అందించాలన్నారు. ఈవీఎంలను భద్ర పరచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతను రిటర్నింగ్ అధికారులు ప్రతిరోజు సందర్శించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపుకు చర్యలు చేపట్టామన్నారు.

## ఓట్ల లెక్కింపును విజయవంతం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ఉంచుకోవాలన్నారు. ఈవీఎంలలో పోల్ అయిన ఓట్ల లెక్కింపుకు సంబంధించి ఎన్నికల అధికారులు, సిబ్బందికి ముందస్తుగానే సరైన శిక్షణ ఇవ్వాలన్నారు. ఎన్నికల ఫలితాలను ప్రకటించడంలో ఏ మాత్రం ఆలస్యం చేయవద్దన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా, జిల్లా కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్/ జిల్లా ఎన్నికల అధికారి జి.సృజన పాల్గొన్నారు.

## ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలి


మాట్లాడుతున్న వక్తలు

కర్నూలు సిటీ, మేజర్‌న్యూస్: మధ్య భారతంలో ఆదివాసీలపై సైన్యం చేస్తున్న యుద్ధాన్ని నిలిపివేయాలని, ఆదివాసీల హక్కులను కాపాడాలని ప్రజాస్వామ్య సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. సోమవారం నగరంలో ఛత్తీస్‌ఘడ్‌లో ఆదివాసీలను ఎందుకు చంపి వేస్తున్నారు? అనే అంశంపై వేదిక ఆధ్వర్యంలో సంఘీభావ సదస్సు నిర్వహించారు. రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించగా వక్తలుగా ప్రజా అభ్యుదయ సంస్థ నాయకులు భార్గవ, సీపీఐ నాయకులు రామక్రిష్ణారెడ్డి, విరసం నాయకులు పాణి, పౌర హక్కుల సంఘం నాయకులు అల్లాబకాస్, రైతు కూలీ సంఘం నాయకులు సుంకన్నలు మాట్లాడారు. ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలన్నారు. అనంతరం దేశంలో కార్పొరేటర్లకు.. అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సదస్సులో రాయలసీమ విద్యావంతుల వేదిక, ఎస్‌డీపీఐ నాయకులు పాల్గొన్నారు.

# చెరువులో మట్టిని తోడేస్తున్నారు


చెరువులో మట్టి తవ్వకాలతో గుంత ఏర్పడిన దృశ్యం


చెరువు కాలువలో తవ్వకాలు జరుపుతున్న అక్రమార్కులు

(మొదటిపేజీ తరువాయి)

సమాచారం కోరగా అసలు చెరువులో తవ్వకాలు జరుగుతున్న సమాచారమే తమ వద్ద లేదని తెలపడం పట్ల సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. అక్రమార్కులకు అధికారుల నుండి పుష్కలంగా సహాయ సహకారాలు అందుతున్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. చివరికి తూతూమంత్రంగా రెవెన్యూ అధికారులు తలారిని చెరువు దగ్గరికి పంపించి తవ్వకాలు పరిశీలించడం పట్ల అధికారులకు ఉన్న చిత్తశుద్ధి ఎంతో తెలుస్తుందని జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### డివైడర్ను ఢీకొని

## ఆర్టీసీ బస్సు బోల్తా

(మొదటిపేజీ తరువాయి)

సాహెబ్ ఓ వాహనాన్ని తప్పించబోయి డివైడర్ను ఢీకొనడంతో బస్సు బోల్తా పడింది. బస్సులో 15 మంది ప్రయాణికులు ఉండగా వారిలో పదిమందికి స్వల్ప గాయాలు అయ్యాయి.కండక్టర్ వలికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు నాలుగో పట్టణ పోలీసులు ఆయనను వెంటనే ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్వల్ప గాయాలైన వారు కూడా స్థానిక ప్రభుత్వాసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నారు. డాక్టర్లు కండక్టర్ వలి కి చెయ్యి విరిగిందని పరిస్థితి విషమంగానే ఉందని తెలిపారు.



# శిథిల కాలువలు


మల్లెవేముల సమీపంలో దెబ్బ తిన్న పంట కాలువ

(మొదటిపేజీ తరువాయి)

కాలువ ఆయకట్టు 10,138 ఎకరాలు ఉండగా శిరివెళ్ల, ఆళ్లగడ్డ, చాగలమర్రి, ఉయ్యాలవాడ, దొర్నిపాడు , రుద్రవరం రైతులు కేసీ నీటిపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. ఇక్కడి ప్రాంతాల్లో సాగుకు కేసీ కాలువ నీరే ఆధారం. అలాంటిది. అడుగడుగునా అడ్డంకులు ఉండటంతో చివరి ఆయకట్టుకు నీరందడం ప్రశ్నార్థకంగా మారింది.నంద్యాల జిల్లాలో మొత్తం ఐదు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుండగా ఇందులో ఇందులో 1.65 లక్షల ఎకరాలకు కేసి కెనాల్ నీరే ఆధారం. అలాంటి కేసి కెనాల్ పలు చోట్ల శిథిలమైపోయింది. ప్రతి ఏడాది తాత్కాలిక పనులతో సరిపెడుతున్నారు.

**కేసీ కింద మండలాల వారీగా ఆయకట్టు...**

ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలోని చాగలమర్రి మండలంలో 8,917 ఎకరాలు, ఆళ్లగడ్డ మండలంలో 28574 ఎకరాలు, దొర్నిపాడు మండలంలో 18,500 ఎకరాలు, ఉయ్యాలవాడ మండలంలో 12,108, రుద్రవరం మండలం 254 ఎకరాల ఆయకట్టు ఉంది.

**అసంపూర్తిగా కేసీ పంట కాలువలు..**

ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలో కేసీ ప్రధాన కాలువ నుంచి పంటలకు సాగు నీరు అందించే కాలువలు అసంపూర్తిగా ఉండిపోయాయి. కొన్నేళ్లుగా లైనింగ్ పనులు చేపట్టకపోవడంతో చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. ప్రధాన కాలువ లైనింగ్ దెబ్బతింది. కాలువకు పూర్తిస్థాయిలో నీరు వదిలితే గండ్లు పడే ప్రమాదం ఉంది.చివరి ఆయకట్టుకు నీరు అందకపోవడంతో రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారిస్తున్నారు. ఆళ్లగడ్డ, శిరివెళ్ల, చాగలమర్రి మండలాల్లో బోర్లను నమ్ముకొని వరి నారు సాగు చేస్తున్నా కాలువల పరిస్థితి సరిగా లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మూడేళ్ల కాలువ మరమ్మతులు గురించి పట్టించుకోక పోవడంతో కాలువలు అధ్వాన స్థితికి చేరుకున్నాయి.

**నిధుల గ్రహణం...**

కెనాల్ మరమ్మతులు ప్రతిపాదనలకే అధికారులు సరిపెడుతున్నారు. మూడేళ్ల నుంచి నిధులు కేటాయించకపోవడంతో పనులు చేపట్టడం లేదు. ప్రతి ఏడాది నామమాత్రంగా పనులు చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. నిధులు లేకపోవడంతో పనులు చేయలేక పోతున్నామని అధికారులు చెబుతున్నారు. గతంలో చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు తిరిగి పనులు చేసేందుకు ముందుకు రాలేకపోతున్నారు. దీంతో కేసీ కాలువ ఆయకట్టు పరిస్థితి దయనీయంగా మారింది. కేసీ కెనాల్ మరమ్మతుల గురించి పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ ఏడాదైన పనులు సాగుతాయా లేదా అన్న అనుమానం వ్యక్తమవుతోంది.



**కాలువల పరిస్థితి ఇలా.. :**

అళ్లగడ్డ పరిధిలోని కేసీ ప్రధాన కాలువ 27వ లాక్ మంచి రెండు అడుగుల నీరు మాత్రమే ప్రవహిస్తోంది. దిగువకు నీరు ప్రవహించడం లేదు. దీంతో ఆయా గ్రామాల రైతులు సాగునీరు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.చాగలమర్రి పరిసరాల్లో కేసీ పంట కాలువల్లో మురికి నీరు కూడా ప్రవహిస్తోంది. రెండేళ్ల క్రితం రూ.50 లక్షలతో కేసీ కాలువలను మెరుగుపరిచారు. కొద్దిమేరకే కాలువ పనులు చేయడంతో కొంతమంది రైతులకే ప్రయోజనం కలిగింది. పూర్తి స్థాయిలో చివరి ఆయకట్టు వరకు లైనింగ్ పనులు చేస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది

**కష్టానికి ఫలితం లేదు**
**–మాబుబాషా, రైతు, చాగలమర్రి :**

కేసీ కాలువ కింద నాలుగు ఎకరాల పొలం ఉంది. వరి పంట సాగుకు నీరందడం లేదు. పంట కాలువలు అధ్వానంగా ఉన్నాయి. ప్రత్యామ్నాయంగా మొక్క జొన్న పంట సాగు చేసుకుంటున్నాం. ప్రతి ఏడాది కేసీ నీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి కాలువ పనులు పూర్తి చేయాలి.

**కాలువలు అధ్వానంగా ఉన్నాయి**
**–మల్లారెడ్డి, రైతు, మల్లేవేముల :**

కేసీ కాలువలు ఆధ్వానంగా ఉన్నాయి. మూడు ఎకరాల పొలం ఉంది. పంట కాలువలు అసంపూర్తిగా ఉన్నాయి. కొద్ది వరకే సిమెంట్ లైనింగ్ పనులు చేపట్టారు. కేసీ నీరు ప్రశ్నార్థకంగా మారింది. వర్షాధార పంటలను సాగు చేసుకోవాల్సి వస్తోంది.


కూలూరు రహదారిలో ముళ్ళ కంపలతో నిండుకున్న పంట కాలువ



**పట్టించుకోవడం లేదు**
**– రామకృష్ణారెడ్డి, రైతు, మల్లేవేముల :**

కేసీ పంట కాలువలు అసంపూర్తిగా ఉన్నాయి. కాలువల లైనింగ్ పనులు సరిగా చేయకపోవడంతో లీకేజీ నీటితో ప్రతి ఏడాది నష్టపోతున్నాం. దీని వల్ల నిత్యం సమస్యలు ఎదుర్కొంటున్నాం కాలువలు పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు నీరందించేలా చూడాలి. –

ప్రతిపాదనలు పంపించాం

**జమాల్ వలి, ఏఈ, కేసీ కెనాల్ :**

కేసీ పంట కాలువల పూడికతీత పనులు చేయడానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాకపోవడంతో పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. చేసిన పనులకు నిధులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేయడం లేదు. రూ.18 లక్షలతో ప్రతిపాదనలు కూడా పంపించాం. పంట కాలువలతోపాటు కేసీ ప్రధాన కాలువ లైనింగ్ పనులు చేయడానికి ప్రతిపాదనలు చేశాం. ఈ ఏడాది నిధులు మంజూరైతే తక్షణమే పనులు చేపడతాం.

# రైతులందరికీ ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలి

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్:** జిల్లాలో 2023 ఖరీఫ్ సీజన్‌లో నష్టపోయిన రైతులందరికీ ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.రామక్రిష్ణ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని రైతు సంఘం కార్యాలయంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్నూలు జిల్లాలో రెండు మండలాలు తప్ప మిగిలిన అన్ని మండలాలను ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించిందని, నష్టపోయిన రైతుల ఖాతాల్లో ఇన్‌పుట్‌సబ్సిడీని జమ చేయాలన్నారు. కానీ ప్రభుత్వం కంపెనీలకు ప్రీమియం చెల్లించింది కానీ రైతులకు మాత్రం సబ్సిడీని మాత్రం చెల్లించలేదన్నారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు వచ్చే అవకాశం ఉందని, దీంతో రైతాంగం కూడా భూముల సాగుకు సిద్ధమవుతున్నారన్నారు. రైతులకు 90శాతం సబ్సిడీ కింద సరిపడ విత్తనాలను ప్రభుత్వమే అందించాలని డిమాండ్ చేశారు. కొన్నిచోట్ల రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని నకిలీ విత్తనాలను రైతులకు అంటగట్టి మోసం చేస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు, నాయకులు రంగారెడ్డి, కోటకొండ సూరి, ఆంజనేయులు పాల్గొన్నారు.

# హనుమాన్ జయంతి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

**తుగ్గలి, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని పగిడిరాయి గ్రామంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. జూన్ 1వతేదీన హనుమాన్ జయంతి సందర్భంగా పగిడిరాయిలో హనుమాన్ జయంతి రథోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడంలో నిర్వాహకులు నిమగ్నమయ్యారు. హనుమాన్ జయంతి సందర్భంగా కీర్తిశేషులు ఆరేపల్లి భీమిరెడ్డి, ఆరేపల్లి సుభాషిణమ్మ, అల్లుళ్లు, కుమారైలు జగన్‌మోహన్‌రెడ్డి, సౌజ్య, జగన్నాథ్‌రెడ్డి, అనితలు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే శ్రీదేవమ్మ కుమారుడు, కోడలు రామ్మోహన్‌రెడ్డి, రమ్యయరెడ్డిలు పూజలు చేయిస్తున్నారు. సాయంత్రం 5గంటలకు రథోత్సవం, 6గంటలకు లంకోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా 1వతేదీ కొంతలపాడు గ్రామానికి చెందిన సుభాషిణమ్మ, 2వతేదీన డీఎస్పీ హరినాత్‌రెడ్డి కుమార్తె శ్రీసాయిసాహిత్యతల హరిలు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. హనుమాన్ జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు వివిధ గ్రామాల నుంచి ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చే అవకాశం ఉంది. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేయడంలో నిమగ్నమయ్యారు.


పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి

# గౌరీగోపాల్ హాస్పిటల్‌లో సీపీఆర్ అవగాహన సదస్సు


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** నగరంలోని గౌరీగోపాల్ హాస్పిటల్‌లో సోమవారం సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతర్జాతీయ అత్యవసర చికిత్స దినోత్సవం సందర్భంగా హాస్పిటల్ వైద్యులు ఆసుపత్రి సిబ్బందికి సీపీఆర్ ఎలా చేయాలన్న దానిపై అవగాహన కల్పించారు. సీపీఆర్ ఏ విధంగా చేసి రోగి ప్రాణాలు కాపాడాలో వివరించారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ వయసుతో నిమిత్తం లేకుండా గుండె జబ్బులు వస్తున్నాయన్నారు. ఎంతోమంది ఉన్నట్టుండి గుండె సంబంధిత జబ్బులతో ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. గుండెపోటు వచ్చిన సమయంలో ఆసుపత్రికి వెంటనే తీసుకెళ్లలేని సమయంలో సీపీఆర్ చేసి ప్రథమ చికిత్సను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శివశంకర‌రెడ్డి, మాలకొండయ్య, ఖాద్రి, చంద్రశేఖర్, నర్సులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# భారత ప్రజాస్వామ్య సౌధానికి నిర్మాత నెహ్రూ

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్:** భారత ప్రజాస్వామ్య సౌధానికి నిర్మాత జవహర్ లాల్ నెహ్రూ అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బాబురావు అన్నారు. సోమవారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నెహ్రూ 60వ వర్ధంతిని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ నెహ్రూ భారతదేశ మొదటి ప్రధానిగా దేశానికి ఎన్నో సేవలు అందించారన్నారు. నెహ్రూ మంచి పరిపాలన దక్షుడన్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు సుధాకర్‌బాబు, జిలానిబాష, పీజీ నరసింహులుయాదవ్, అనంతరత్నంమాదిగ, లాజరస్, వెంకటరాముడు, సుభాన్, షేక్‌ఖాజాహుసేన్, బజారన్న, వెంకటస్వామి, సుబ్రమణ్యం, అబ్దుల్‌షా, శేషయ్య, అశోక్ పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న దృశ్యం

# పొలాల్లో రీ సర్వే కొలతలను సరి చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**తుగ్గలి, మేజర్‌న్యూస్:** పొలాల్లో చేసిన రీ సర్వే కొలతలను సరిచేయాలని మండల పరిధిలోని సూర్యతాండ, బాటతాండ, ఉప్పర్లపల్లి రైతులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రమైన తుగ్గలి తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మంల కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ రీసర్వే సక్రమంగా చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రైతులకు సంబంధించిన భూ సర్వేలో అవకతవకలు జరిగాయని, దీంతో చాలామంది రైతులు భూములు కోల్పోవాల్సిన పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. రీ సర్వే తప్పుల తడకగా చేయడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందన్నారు. వెంటనే రెవెన్యూ అధికారులు స్పందించి గ్రామాల్లో తిరిగి రీసర్వే చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ షర్మిలకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన రైతులు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## క్రైమ్ స్పాట్

# నాటుసారా బట్టీలపై పోలీసులు దాడి

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్:** మండలంలోని నల్లమల ప్రాంతానికి సమీపంలో ఉన్న ఎర్రమఠం చెంచుగూడెంలో నాటుసారా బట్టీలపై ఎస్ఐ హరిప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం దాడిచేశారు. ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల మేరకు, జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎర్రమఠం చెంచుగూడెంలో నాటుసారా తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. ఆ ప్రదేశంలో 15 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. 900లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఇలాంటి నాటు సారాను తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు. చట్ట వ్యతిరేఖ చర్యలకు పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

# ఫోక్సో కేసులో నిందితుడిని జీవిత ఖైదు శిక్ష


జీవిత ఖైదు శిక్ష పడిన నిందితుడు

**కర్నూలు లీగల్, మేజర్‌న్యూస్:** హోళగుంద పోలీసుస్టేషన్ పరిధిలో 2021 సంవత్సరంలో జరిగిన ఫోక్సో కేసులో ఒకరికి జీవిత ఖైదు జైలు శిక్ష, రూ. 20వేలు జరిమానా విధిస్తూ కర్నూలు ఫోక్సో కేసుల స్పెషల్ కోర్టు జడ్జి జి.భూపాల్‌రెడ్డి సోమవారం తీర్పు వెలువరించారు. ఏడేళ్ల బాలికపై జరిగిన లైంగిక దాడి కేసులో హోళగుంద పోలీసుస్టేషన్‌లో 2021 ఆగస్టు 13తేదీన కేసు నమోదైంది. పోలీసు అధికారులు దర్యాప్తు చేపట్టి ఈ కేసులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. నిందితుడు బోయ రంగమునికి జీవిత ఖైదు జైలు శిక్ష, రూ. 20వేలు జరిమానా విధిస్తూ అన్ని కోణాల్లో ఈ కేసును సమగ్రంగా విచారించి జడ్జి తీర్పు ఇచ్చారు. దర్యాప్తు అధికారి అప్పటి ఆదోని డీఎస్పీ వినోద్‌కుమార్, ప్రాసిక్యూషన్ తరపున వాదించిన గోపాల్‌కృష్ణ, కర్నూలు ఫోక్సో కోర్టు స్పెషల్ పీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ షేక్షావలి చేసిన కృషిని కర్నూలు జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ ప్రత్యేకంగా అభినందించారు.

# విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

**గడివేముల, మేజర్‌న్యూస్ :** మండలంలోని పెసరవాయి గ్రామానికి చెందిన వాసుదేవ రెడ్డి 42 సంవత్సరాలు విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు అమ్మాయిలు కలరు. మృతుని భార్య స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతుడు వాసుదేవరెడ్డి గత రెండు రోజుల క్రితం గాలివానతో విద్యుత్ స్తంభాలు పడిపోయి డిష్ వైరు తొలగిపోవడంతో సోమవారం నాడు గ్రంథివేముల గ్రామంలో మసీదు పరిసర ప్రాంతంలో విద్యుత్ స్తంభం ఎక్కి కేబుల్ వైర్లు సరిచేస్తుండగా హై టెన్షన్ విద్యుత్ తీగ తగలడంతో విద్యుత్ షాక్‌తో చేతులకు మరియు మెడ భాగాన బాగా కాలిపోవడంతో విద్యుత్ స్తంభం నుండి కిందపడి అక్కడిక్కడే మరణించాడని మృతుని భార్య స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రమాదం జరిగిన సంఘటన స్థలానికి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, ఎల్లారెడ్డి,మండల వైసీపీ నాయకులు శివరాంరెడ్డి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు.


మృతుడు ఫైల్ ఫోటో

# పత్తి విత్తనాల కొరతను సృష్టిస్తే చర్యలు తప్పవు


సమావేశంలో మాట్లాడుతున్న జేడీ వరలక్ష్మి

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్:** జిల్లాలో పత్తి పంటను అధికంగా సాగు చేస్తారని, వాటికి 12లక్షల విత్తనాల ప్యాకెట్లు అవసరమవుతాయని గుర్తించడం జరిగిందని, కంపెనీలు పత్తి విత్తనాల కొరతను సృష్టిస్తే చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి వరలక్ష్మి హెచ్చరించారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో విత్తన కంపెనీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రముఖ పత్తి విత్తన కంపెనీలైన నూజివీడు, కావేరి, యుఎస్‌అగ్రిసైన్స్, మహికో, వేద, నాక్ వంటి కంపెనీలకు చెందిన 12లక్షల ప్యాకెట్లను సరఫరా చేయాలని ఆదేశించడం జరిగిందన్నారు. ఆయా కంపెనీలు పత్తి విత్తనాల కొరత సృష్టించకుండా కంపెనీ ప్రతినిధులు రోజువారి అమ్మకపు వివరాలు, ప్రొడక్షన్ ప్లాన్‌ప్రకారం విత్తనాలను సరఫరా చేయాలన్నారు. గరిష్ట అమ్మకపు ధర కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఏడీఏ సాలురెడ్డి, ఏవోలు, విత్తనాల కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఆదోని నియోజకవర్గంలో

# 14టేబుళ్లు, 19రౌండ్లు

- ఎన్నికల కౌంటింగ్ సిబ్బందికి హాల్‌లో సెల్‌ఫోన్ అనుమతి లేదు
- సబ్ కలెక్టర్, ఎన్నికల అధికారి

**ఆదోని, మేజర్‌న్యూస్ :** జూన్ 4వ తేదిన జరిగే ఎన్నికల కౌంటింగ్ సిబ్బంది జూన్ 3వ తేదిన హాజరు కావాలని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ పేర్కొన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదోని నియోజకవర్గం సంబంధించి ఎన్నికల విధులకు కేటాయించిన సిబ్బందికి సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ, కౌంటింగ్ సిబ్బంది రాండమజేషన్ ద్వారా నియోజకవర్గాలకు టేబుళ్లకు సిబ్బందిని కేటాయించారు. ఆదోని నియోజకవర్గం సంబంధించి 256



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

పోలింగ్ కేంద్రాలు ఉండగా, 14టేబులు ఏర్పాటు చేయడం జరిగిందని, 19రౌండ్లలో కౌంటింగ్ జరుగుతుందన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి కౌంటింగ్ నిర్వహిస్తారని, అనంతరం ఈవీఎం మిషన్ల ద్వారా ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. నిబంధనలకు ప్రకారం విధులు



సమావేశానికి హాజరైన అధికారులు

నిర్వహించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై శాఖపరమైనచర్యలు, క్రిమినల్ కేసులు నమోదు అవుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హసినా సుల్తాన్, కార్యాలయ పరిపాలన అధికారి శేషయ్య, ఇంచార్జ్ ఎంపిడిఓ విజయ శేఖర్ రావు, డిఎల్‌పిఓ కార్యాలయ పరిపాలన అధికారి వీరభద్రప్ప, డిప్యూటీ తహశీల్దార్లు రామేశ్వరరెడ్డి, వీరభద్రగౌడ్, వలిబాష, దీప, వినీత్, సబంధిత అధికారులు పాల్గొన్నారు.

### శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే

## కఠిన చర్యలు తీసుకుంటాం

**నందికోట్కూరు, మేజర్‌న్యూస్ :** శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నందికోట్కూరు రూరల్ అండ్ టౌన్ ఇన్‌స్పెక్టర్లు విజయ్‌భాస్కర్, ప్రకాష్‌కుమార్‌లు హెచ్చరించారు. సోమవారం నందికోట్కూరు రూరల్ అండ్ టౌన్ ఇన్‌స్పెక్టర్‌లు ఆధ్వర్యంలో అల్లూరు, మల్యాల గ్రామాలలో పోలీస్ కవాతు నిర్వహించారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

అనంతరం గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల నిబంధనలపై అవగాహనా కల్పించారు. నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూరు, డీఎస్పీ శ్రీనివాసరావు సూచనలతో సమస్యాత్మక గ్రామాలలో పోలీసు కవాతు నిర్వహించి ప్రజలకు భరోసా కల్పించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందికోట్కూరు టౌన్ మరియు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలలో ఎటువంటి అల్లర్లు జరుగకుండా ముందస్తు చర్యలు చేపట్టామని అన్నారు. గ్రామాల్లో ప్రజలు అందరు వివాదాలకు దూరంగా మెలగాలని సూచించారు. జిల్లా మొత్తం 30 పోలీస్ యాక్టు అమలులో ఉందని పేర్కొన్నారు. రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులపై నిఘా ఉంచి వారికి కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. ఎన్నికల్లో గెలిచినవారు ఎలాంటి విజయోత్సవ ర్యాలీలకు, టపాసులు కాల్చడానికి అనుమతి లేదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జూపాడుబంగ్లా ఎస్ఐ లక్ష్మీనారాయణ, బ్రాహ్మణకోట్కూరు ఎస్ఐ నాగార్జున, ముచ్చుమర్రి ఎస్ఐ జయశేఖర్ మరియు స్థానిక పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు

**కర్నూలు ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** కర్నూలు జిల్లాలో ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ఆర్ఐఓ గురుయ్యశెట్టి తెలిపారు. ఉదయం 9గంటలకు ప్రారంభమైన మొదటి సంవత్సరం పరీక్షలకు 10,601మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 10,102మంది హాజరైనట్లు తెలిపారు. 414మంది హాజరు కాలేదన్నారు. మధ్యాహ్నం ప్రారంభమైన ద్వితీయ సంవత్సరం పరీక్షకు 3,218మంది హాజరు కావాల్సి ఉండగా 3049మంది హాజరై 169మంది హాజరు కాలేదన్నారు. ఎలాంటి మాక్ ప్రాక్టీస్ జరగలేదని తెలిపారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు : ఎస్పీ



**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లాఎస్పీ రఘువీర్‌రెడ్డి అన్నారు. సోమవారం కోవెలకుంట్లలోని జమ్మలమడుగు చౌరస్తా నుండి ముదిగేడు చౌరస్తా వరకు పోలీసులతో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవన్నారు. స్ట్రాంగ్‌రూమ్ పరిసర ప్రాంతాలలో 144 సెక్షన్ అమలు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల కౌంటింగ్ దృష్టిలో పెట్టుకొని జిల్లాలో ఎటువంటి గొడవలు, అల్లర్లు జరగకుండా ఉండేందుకు ప్రజలకు భరోసా కల్పించేందుకు కేంద్ర సాయుధ బలగాలతో పోలీస్ కవాతు నిర్వహించడంజరిగిందన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి గ్రామ పెద్దలు, ప్రజలతో మమేకమై గ్రామాలలో అందరూ వివాదాలకు దూరంగా ఉండాలని శాంతియుతంగా మెలగాలని కోరారు. జిల్లామొత్తం 30 పోలీస్ యాక్టు అమలులో ఉందని ఈవీఎంలను ఉంచిన స్ట్రాంగ్‌రూమ్ పరిసర ప్రాంతాలలో గట్టి బందోబస్తు ఉందన్నారు.ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు వారు సంబంధించిన వ్యక్తులు ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, సభలు సమావేశాలు చేయరాదని టపాసులు పేల్చవద్దని అన్నారు. రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులపై నిఘా ఉంచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఆళ్ళగడ్డ డీఎస్పీ శప్రుద్దిన్, సీఐలు జయచంద్ర, హనుమంతు నాయక్, చంద్రబాబు, ఎస్ఐలు హరిప్రసాద్, రాంమోహన్‌రెడ్డి, బీఎస్ఎఫ్ అధికారులు, స్పెషల్ పార్టి పోలీసులు పాల్గొన్నారు.

## మహానంది క్షేత్రంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

- వైభవంగా పల్లకీ ఉత్సవం

**మహానంది, మేజర్‌న్యూస్:** మహానంది పుణ్యక్షేత్రంలో భక్తుల రద్దీ నిర్విరామంగా కొనసాగుతోంది. వేసవి సెలవులు కావడంతో సుదూర ప్రాంతాల నుండి వేలాదిమంది భక్తులు శ్రీ కామేశ్వరీ సమేత మహానందీశ్వర స్వామివార్లను దర్శించుకుంటున్నారు. సోమవారం భక్తులతో క్షేత్రం కలకల లాడింది. ఆలయంలోని పుష్కరణీలలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**పల్లకీ సేవ:** మహానంది పుణ్యక్షేత్రంలో సోమవారాన్ని పురష్కరించుకొని శ్రీ కామేశ్వరీ సమేత మహానందీశ్వర స్వామివార్లకు పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.



మహానంది క్షేత్రంలో భక్తుల రద్దీ, పల్లకి ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ముందుగా అలంకార మండపంలో స్వామి అమ్మవార్లను పల్లకిలో కొలువుదీర్చి ప్రత్యేక అలంకారాలతో వేదపండితులు వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రదక్షణగా పల్లకీ ఉత్సవాన్ని భక్తుల ఓంకార నామ స్మరణాల మధ్య నిర్వహించారు.

## మృతుని కుటుంబసభ్యులను పరామర్శించిన కోట్ల



**బేతంచెర్ల మేజర్ :** బేతంచెర్ల మండలం రుద్రవరం గ్రామంలో గత రెండు రోజుల క్రితం గ్రామంలో జరిగిన ఘర్షణలో హరి ప్రసాద్ (38) అనే యువకుడు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కేంద్ర మాజీ మంత్రివర్యులు డోన్ నియోజకవర్గం ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి, నంద్యాల టిడిపి ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరిలు మృతుని కుటుంబ సభ్యులను కలిసి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు .అనంతరం వారు మాట్లాడుతూ వ్యక్తిగత కక్షలకు రాజకీయ కక్షలకు స్వస్తి పలికి ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని సూచించారు. మృతుని కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మండల కన్వీనర్ ఉన్నం ఎల్లా నాగయ్య, లాయర్ భాస్కర్ రెడ్డి, రాఘవరెడ్డి, ఉన్నం సుధాకర్, ఉన్నాం చంద్రశేఖర్, షేక్షావలి చౌదరి, ఎరుకల చెరువు శివ, జావాజ్ వెంకటేశ్వర్లు, బుక్కాపురం లక్ష్మన్న, సిమెంట్ నగర్ రాముడు బుగ్గన పల్లె తాండ చంద్ర, స్థానిక టిడిపి నాయకులు కృష్ణుడు, వెంకట రాముడు, శశి కుమార్ అప్ప, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## సుచిశుభ్రతతో రుచికరమైన భోజనం అందించాలి

- మధ్యాహ్న భోజన కార్మికులకు ఒక్కరోజు శిక్షణ

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం ద్వారా సుచిశుభ్రతతోకూడిన రుచికరమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని డాక్టర్ సాజిదా ఫిర్దోస్ అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే మధ్యాహ్న భోజన కార్మికులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఎంఇఓ-2 సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ సాజిదా ఫిర్దోస్, అగ్నిమాపక అధికారులు హాజరై తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు బలవర్ధకమైన ఆహారాన్ని అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. భోజనం తయారు చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు సుచిత శుభ్రత పాటించాలన్నారు. అలాగే మెను ప్రకారం ఆహారాన్ని విద్యార్థులకు అందించడంతో పాటు రుచిగా నాణ్యతతో చేయాలన్నారు. మెనులో సూచించిన విధంగా తప్పనిసరిగా భోజనం అందించాలని అన్నారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది మాట్లాడుతూ వంట చేసే టప్పుడు ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరు



మధ్యాహ్న భోజన కార్మికులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సాజిదా ఫిర్దోస్

అవగాహన కలిగి ఉండాలన్నారు. కాస్త నిర్లక్ష్యం వహిస్తే భారీ ప్రమాదం జరిగే అవకాశం ఉందని వంట చేసే టప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని కార్మికులకు అవగాహన కల్పించారు. అనంతరం రీసోర్స్ పర్సన్ స్వాతి ఆధ్వర్యంలో వంటల పోటీలు నిర్వహించగా మొదటి బహుమతి జట్పిహెచ్‌ఎస్ ఆత్మకూరు, ఎంపిపి పాఠశాల కొట్టాలచెరువు, రెండవ బహుమతి ఎంపిపిఎస్‌డబ్ల్యుబి సంతమార్కెట్, మూడవ బహుమతి ఎంపిపి పాఠశాల వెంగళ రెడ్డి నగర్ కార్మికులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అయ్యుబ్ అహ్మద్, ఎఎన్‌ఎం సుబ్బలక్ష్మి, ఫైర్ సిబ్బంది ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

# చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : ఎస్పీ

– పెట్రోల్ బంకు కూడలి వద్ద మాక్ డ్రిల్

– విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు



మోల్ డ్రిల్ నిర్వహిస్తున్న దృశ్యం

**బనగానపల్లె, మేజర్‌న్యూస్ :** చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎంతటి వారిపైనైనా కఠిన చర్యలు తీసుకుంటామని నంద్యాల జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా శాంతి భద్రతల సమస్య వచ్చినప్పుడు అల్లరి మూకలను ఏ విధంగా అదుపు చేస్తూ చెదరకొట్టాలో తెల్పుతూ బనగానపల్లె పట్టణంలోని పెట్రోల్‌బంకు కూడలి వద్ద స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో పోలీసుల మోక్ ఆపరేషన్ మోక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా పోలీసులు సమయాత్తమై ఉండాలన్నారు. అలాంటి సంఘటనలు ఏర్పడినప్పుడు మోక్ డ్రిల్ నిర్వహించి ఎలా అదుపు చేయాలో పోలీసులకు తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ ముగిసే వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని వీటితోపాటు 144 సి.ఆర్.సి సెక్షన్ 30 పోలీసు యాక్టు అమలులో వస్తుందని ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి హింసాత్మక చర్యలకు పాల్పడితే పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో బనగానపల్లె నియోజకవర్గ ప్రజలకు తెలిసేందుకు మోక్ డ్రిల్ నిర్వహించామన్నారు. అందుకు సందర్భంగా ఎన్నికలకు సంబంధించి రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్లు అవసరమైన మేరకు బైండోవర్ హౌస్ అరెస్టు చేయడం జరిగిందని ప్రతిరోజు జిల్లా వ్యాప్తంగా కార్టన్ సర్చ్ ఆపరేషన్, ఫ్లాగ్ మార్చ్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చట్టం అందరికీ సమానమని ఎవరు అతిక్రమిచ్చినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ప్రవీన్ కుమార్, డోన్ డీఎస్పీ శ్రీనివాస రెడ్డి, ట్రైనింగ్ డి.ఎస్.పి రఘువీర్, సి.ఐ సుబ్బారావు, రూరల్ సి.ఐ తిమ్మారెడ్డి, ప్యాపిలి ఎస్.ఐ సుధాకర్ రెడ్డి, డోన్ సి.ఐ ప్రీతమ్ రెడ్డి, డోన్ టౌన్ ఎస్.ఐప్రవీన్ కుమార్, రిజర్వ్ ఎస్.ఐ శ్రీనివాసులు, బనగానపల్లె ఎస్.ఐ రామిరెడ్డి, సుధాకర్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

# పది సప్లమెంటరీకి 1,132మంది హాజరు

**కర్నూలు ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** జిల్లాలో సోమవారం జరిగిన 10వతరగతి సప్లమెంటరీ పరీక్షలకు కర్నూలు జిల్లా నుంచి మొత్తం 2,107మంది విద్యార్థిని, విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 1,132మంది హాజరై పరీక్ష రాశారు. 975మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. ఈ పరీక్షలను పర్యవేక్షించడానికి జిల్లాలో ఫ్లైయింగ్ స్క్వాడ్‌ను నియమించారు. ఎటువంటి మాల్ ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు.

# శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దు : డిఎస్పీ



పోలీసు కవాతలో పాల్గొన్న డిఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని నంద్యాల పట్టణ డిఎస్పీ ఎన్ రవీంద్రనాథ్‌రెడ్డి హెచ్చరించారు. నంద్యాల పట్టణంలో సోమవారం పోలీసు కవాత్తు నిర్వహించారు. నంద్యాల పట్టణంలో గాంధీ చౌక్, మూలాన్‌పేట, ఆత్మకూరు బస్టాండ్, సిటి బస్టాండ్ తదితర ప్రాంతాల్లో పోలీసు కవాత్తు నిర్వహించారు. 30 పోలీసు యాక్ట్ అమలులో ఉందని, రౌడీషీటర్లు, నేర చరిత్ర గల వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని డిఎస్పీ అన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎవరే కానీ గుంపులుగా ఉండరాదన్నారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ బివి చలపతి, తాలూకా సీఐ దస్తగిరిబాబు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మిగనూరు రాజకీయాల్లో ఇదేమి వింత..!!

## కిందస్థాయి నాయకులతో డబ్బులు పంచాయితీలా రాష్ట్ర రాజకీయాల్లో భ్రష్టు పట్టించిన అభ్యర్థి కోనేరు

**ఎమ్మిగనూరు ప్రతినిధి మేజర్ న్యూస్ :** దేశ రాష్ట్ర రాజకీయాల్లో ఎక్కడ చోటుచేసుకుని వింత నేడు ఎమ్మిగనూరు రాజకీయాల్లో చోటు చేసుకోవడం చాలా విడ్డూరంగా ఉందని టిడిపి మాజీ కౌన్సిలర్ కోనేరు నాగేంద్రప్రసాద్ ఓ పార్టీ అభ్యర్థి నిర్వాకం పై నేరుగా ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటన లో రాజకీయాలంటే డబ్బుతో కూడుకున్నవే ఇదంతా జరుగుతున్న తంతే.. ఎవరికీ తెలియని విషయం కాదు.. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ఓటర్లను నోట్లతో కొనడం పరపాటి గానే మార్చుకున్నారు.. అయితే ఈ నోట్ల కట్టలు ఆ పార్టీలలోని కింది స్థాయి నాయకుల చేత ఓటర్లకు చేరవేస్తారు. ఈ చేరవేతలో కింది స్థాయి నాయకులు నోట్లో నొక్కేశారని వాటిని తిరిగి ఇవ్వాలంటూ ఓ ముఖ్య పార్టీ అభ్యర్థి గ్రామాలను.. పట్టణంలోని వార్డులను తిరుగుతూ నాయకులతో పంచాయతీ పెట్టడం డబ్బు తిరిగి ఇవ్వమని చెప్పడం అవసరమైతే బెదిరించడం లాంటి రాజకీయాలు రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా వింత ఎమ్మిగనూరులో చోటు చేసుకోవడం దారుణమన్నారు. దీనిని బట్టి చూస్తే ఆ అభ్యర్థి తన ఓటమిని ముందే అంగీకరించినట్లు అర్థమవుతుందని ఆయన దుయ్య బట్టరు. ఇలాంటి నాయకులు పార్టీ కార్యకర్తలే కొద్దిగా డబ్బు దాచుకుంటే ఓర్వలేకపోతున్నారు కార్యకర్తలు కాపాడుకోలేని వారుగెలిస్తే నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి పనులు చేస్తారని విమర్శించారు.. ఈ విషయం నాయకులు కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారని ఆ పార్టీ ఉన్నత నాయకుల ఆలోచించి సదరు అభ్యర్థి చేసిన ఈ విడ్డూరమైన పనిని గ్రహించి తగిన గుణపాఠం చెబితే కానీ ఎమ్మిగనూరులో పార్టీ క్యాడర్ నిలవదని గ్రహించాలంటూ సూచించారు.

# ఆళ్లగడ్డ పట్టణంలో మాబ్ ఆపరేషన్- మాక్ డ్రిల్ నిర్వహణ

- **జిల్లాలో విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహణకు అనుమతి లేదు**
- **చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎంతటి వారిపైనైనా కఠిన చర్యలు**
- **జిల్లా ఎస్పీ కె .రఘువీర్ రెడ్డి**



**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్:** నంద్యాల జిల్లాలో ఎక్కడైనా శాంతి భద్రతల సమస్య ఉత్పన్నం అయినప్పుడు అల్లరి మూకను ఏ విధంగా అదుపు చేస్తూ చెదరగొట్టాలో తెలియజేస్తూ ఆళ్లగడ్డ పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా పోలీసులు మాబ్ ఆపరేషన్- మాక్ డ్రిల్ ను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు రోజున ఎలాంటి పరిస్థితులు, సవాళ్లు ఎదురైనా వాటిని అధిగమించడానికి పోలీసులు ఇప్పటి నుండే సమాయత్తమై ఉన్నారు అనే సందేశాన్ని జిల్లా ప్రజలకు ఈ మాక్ డ్రిల్ ద్వారా ఇస్తున్నామన్నారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తి అయ్యేంతవరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉందని అలాగే సెక్షన్ 144 సి ఆర్ పి సి, సెక్షన్ 30 పోలీస్ ఆక్ట్ కూడా అమలులో ఉందన్నారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి హింసాత్మక చర్యలకు పాల్పడితే అట్టి వారిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో జిల్లా ప్రజలకు (ఆళ్లగడ్డ నియోజకవర్గం ప్రజలకు )తెలియజేసేందుకు ఈరోజు ఇక్కడ మాక్ డ్రిల్ చేసామ న్నారు. కౌంటింగ్ సందర్భంగా ఎన్నికలకు సంబంధించిన రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్లును అవసరమైన మేరకు బైండోవర్, హౌస్ అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. ప్రతిరోజు జిల్లా వ్యాప్తంగా నాకా బందీలు, కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్స్, ఫ్లాగ్ మార్చ్ వంటి కార్యక్రమాలు చేస్తూ అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట వేసేందుకు జిల్లా పోలీసులు పై కార్యక్రమాలను చేయుచున్నారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ కె.ప్రవీణ్ కుమార్ , ఆళ్లగడ్డ డిఎస్పి షేక్ షర్ఫుద్దీన్ , ఇన్స్పెక్టర్లు రమేష్ బాబు , హనుమంతు నాయక్, చంద్రబాబు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు శ్రీనివాసులు, సబ్–ఇన్స్పెక్టర్లు వెంకట రెడ్డి, నగీన, నరసింహులు, సురేష్, రామంజనేయరెడ్డి, రిజర్వు సబ్ ఇన్స్పెక్టర్ హర్షవర్ధన్ రెడ్డి తో పాటు జిల్లా పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

## పవర్ లిఫ్టింగ్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా

# వేణుగోపాల్, లోకేష్ ఎన్నిక

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:** జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా వేనుగోపాల్, లోకేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా మురళీమోహన్‌రెడ్డి, మిశామ్యా, శ్రీధర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, కార్యదర్శిగా లోకేష్, సంయుక్త కార్యదర్శిగా శ్యామ్‌కుమార్, రేష్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వేణుగోపాల్, కోశాధికారిగా రవితేజతోపాటు ఈసీ మెంబర్లుగా శ్రీనివాసరావు, సుప్రియ, కళ్యాణి, నాగేశ్వరి, సుమిత్రలను ఎన్నుకున్నారు.

## కౌంటింగ్ కేంద్రాలలో పార్టీల నాయకులు

# క్రమశిక్షణ పాటించాలి

**అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు**

**ఆలూరు,హోలహర్వి, మేజర్ న్యూస్ :** వచ్చే నెల 4వ తేదీన కర్నూల్ కేంద్రంలో రాయలసీమ యూనివర్సిటీ లో జరిగే సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ లో ఆయా పార్టీల ఏజెంట్లు క్రమశిక్షణ పాటించాలని ఆలూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాము నాయక్,డిఎస్పీ శ్రీనివాస రెడ్డి,తహశీల్దార్ చంద్ర శేఖర్, సి.ఐ. వెంకటేశ్వర్లు ఆయా పార్టీల నాయకులకు తెలిపారు. సోమవారం ఆలూరు తహశీల్దార్ కార్యాలయం, హోలహర్వి పోలీస్ స్టేషన్ నందు వారు ఆయా పార్టీల నాయకులకు, కౌంటింగ్ ఏజెంట్లకు ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కౌంటింగ్ హాలులో అభ్యర్థులు,ఏజెంట్లు సామ రస్యంగా ఉండాలన్నారు. రాయల సీమ యూనివర్సిటీలో జరిగే ఆలూరు నియోజకవర్గం సంబం ధించి కౌంటింగ్ కేంద్రానికి 4వ తేదిన ఉదయం 6గంటలకు అభ్యర్థి లేదా కౌంటింగ్ ఏజెంట్ తో పాటు పోస్టల్ బ్యాలెట్,ఈటిబిఎస్, కౌంటింగ్ కేంద్రంలో ఏజెంట్లు మొత్తం 16 మంది హాజరు కావాలన్నారు. 7 గంటలకు స్ట్రాంగ్ రూం కు ఎవరు వచ్చిన రాకపోయినా వచ్చిన వారి ముందర స్ట్రాంగ్ రూం తెరచి ఈవిఎం లను బయటికి తీస్తామన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి అభ్యర్థులు,ఏజెంట్లు పెన్ ,పేపర్ ,సెల్ ఫోన్ లు తీసుకరాకూడదన్నారు. అభ్యర్థులకు, ఏజెంట్లకు టిఫిన్, బోజన వసతి అధికార యంత్రాంగం నిర్వహిస్తుందన్నారు. కావున అభ్యర్థులు,ఏజెంట్లు సోదరభావంతో మసలుకొని కౌంటింగ్ సిబ్బందికి సహకరించి కౌంటింగ్ పూర్తి అయ్యేలా చూడాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో అల్లర్లకు పాల్పడితే అలాంటి వారిని గుర్తించి తక్షణమే కేసులు నమోదు చేసి రిమాండ్ కు పంపే అవకాశాలున్నాయని డిఎస్పి శ్రీనివాసులు హెచ్చరించారు. సమావేశంలో డి.టి రజనీకాంత్ రెడ్డి,ఎస్ఐ. ఓబులేసు, ఆర్ఐ బసవన్న గౌడ్, పార్టీల నాయకులు వీరభద్ర గౌడ్ ,నవీన్ కిషోర్,విరుపాక్షి కుమారుడు చంద్రశేఖర్,షేక్ షా వలి తదితర నాయకులు పాల్గొన్నారు.




హాలహర్వి లో మాట్లాడుతున్న డిఎస్పీ శ్రీనివాసరెడ్డి




అధికారులు, నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.ఓ.రాము నాయక్



# ఇంటర్మీడియట్ తర్వాత విద్యావకాశాలు..






**ఏరోనాటికల్ ఇంజనీరింగ్....**

ఎంసెట్ ఆధారంగా ఏరోనాటికల్ ఇంజినీరింగ్ కోర్సులో ప్రవేశం కల్పిస్తారు. కోర్సులో భాగంగా విమానాలు, హెలికాప్టర్లు, క్షిపణులు, శాటిలైట్ల డిజైనింగ్ వంటి అంశాల్లో శిక్షణనిస్తారు. బిటెక్ పూర్తి చేసిన అభ్యర్థులు ఏరోడైనమిక్స్,ప్రొపల్షన్ వంటి స్పెషలైజేషన్లలలో ఎంటెక్ పూర్తి చేయవచ్చు. యూనివర్సిటీ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ స్టడీస్ ఏరోనాటికల్ ఇంజినీర్లకు ప్రత్యేకంగా ఏవియేషన్ మేనేజ్‌మెంట్ కోర్సును అందిస్తుంది. ఈ కోర్సు పూర్తి చేసినవారికి ఇస్రో, డీఆర్‌డీఓ వంటి ప్రతిష్టాత్మక సంస్థలతోపాటు ప్రముఖ విమాన తయారీ సంస్థలలో భారీ వేతనంతో ఉపాధి అవకాశాలున్నాయి. మన దేశంలో ఐఐటీలతోపాటు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ 70 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణులకు ఏరోస్పేస్ ఇంజినీరింగ్ కోర్సును అందిస్తుంది.

**ఆర్కిటెక్చర్....**

నింగి నంటే భవనాలు, ప్రముఖ స్టేడియంలు, హాస్పిటల్స్, పాఠశాల భవనాలు, అపార్ట్‌మెంట్‌లు ఇలా ఏ భవన సముదాయం గురించి మాట్లాడుకున్నా వాటి డిజైనింగ్‌లో ప్రధాన పాత్ర పోషించేది ఆర్కిటెక్చరల్ ఇంజినీరింగ్. ఈ కోర్సుకు నేటి యువతలో మంచి క్రేజ్ ఉంది. ఐదేళ్ళ వ్యవధి గల ఈ కోర్సుకు ఇంటర్ ఎంపిసి విద్యార్థులు అర్హులు. ఈ కోర్సు అభ్యసించాలనే అభ్యర్థులు దేశ వ్యాప్తంగా నిర్వహించే నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్ పరీక్షలో అర్హత సాధించాలి. బీఆర్క్ పూర్తి చేసిన విద్యార్థులు డిజైనింగ్, రీజనల్ ప్లానింగ్, బిల్డింగ్ ఇంజినీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్ తదితర స్పెషలైజేషన్లలో ఉన్నత విద్యనభ్యసించవచ్చు.

**జర్నలిజం...**

ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షిస్తూ, ప్రజా సమస్యలను ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రభుత్వం, రాజకీయ పక్షాల దృష్టిలోకి తెస్తూ వాటి పరిష్కారాలకు తోడ్పాటునందిస్తున్న వృత్తిలో జర్నలిజం ప్రధానమైనది. ఈ రంగం మీద అభిరుచి గల అభ్యర్థులు ఇంటర్మీడియట్ అర్హతతో జర్నలిజంలో డిప్లొమా కోర్సులు పూర్తి చేసి ఉపాధి పొందవచ్చు. మాస్ కమ్యూనికేషన్ ఒక సబ్జెక్టుగా అనేక విద్యా సంస్థలు డిగ్రీ స్థాయిలో కోర్సులను అందిస్తున్నాయి. సాధారణ గ్రాడ్యుయేట్లు కూడా బ్యాచిలర్ ఇన్ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్‌లో ఏడాది వ్యవధి గల డిగ్రీ, పీజీ కోర్సులు పూర్తి చేసి మంచి వేతనంతో మీడియాలో రిపోర్టర్, సబ్ ఎడిటర్లుగా కెరీర్ ప్రారంభించవచ్చు. అనుభవం, నాలెడ్జ్ ఆధారంగా సిటీ బ్యూరో, స్టేట్ బ్యూరోల స్థాయి నుండి ఎడిటోరియల్ బోర్డు స్థాయికి ఎదగవచ్చు. ఎలక్ట్రానిక్ మీడియాలో ఇన్‌పుట్ ఎడిటర్ల, స్క్రోలింగ్ అసిస్టెంట్‌గా, ప్రోగ్రామ్ ప్రొడ్యూసర్‌గా , న్యూస్ రీడర్‌గా ఇలా అనేక విభాగాల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయి.సోషల్ మీడియాలో జర్నలిజంలో అనుభవం గల వారికి విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. సమాజంలో కూడా మంచి గుర్తింపు ఉంటుంది. అనేక కళాశాలలు, విశ్వవిద్యాలయాలు జర్నలిజం కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌గా నియమించుకుంటున్నాయి. సెక్రటేరియట్ వంటి ప్రభుత్వ విభాగాల్లో జూనియర్, సీనియర్ రిపోర్టర్ల భర్తీ లో వీరికి ప్రాధాన్యముంటుంది. అన్ని ప్రముఖ తెలుగు దిన పత్రికలు, ద హిందూ, టైమ్స్ ఆఫ్ ఇండియా వంటి ఇంగ్లీషు దినపత్రికలు సొంత జర్నలిజం స్కూల్ ద్వారా ఔత్సాహికులైన అభ్యర్థులకు ప్రవేశపరీక్ష నిర్వహించి ఎంపిక చేసిన వారికి శిక్షణనిచ్చి తమ సంస్థల్లోనే ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి.

**హోటల్ మేనేజ్‌మెంట్...**

గ్లోబలైజేషన్ కారణంగా దేశాల మధ్య అంతరం తగ్గిపోయింది. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో జరుగుతున్న సదస్సులు హాజరవుతున్న డెలిగేట్స్, ప్రపంచ ప్రసిద్ధి గాంచిన అనేక పర్యాటక ప్రదేశాలను వీక్షించడానికి దేశవిదేశాల నుండి పర్యాటకుల తాకిడితో ఈ రంగం బాగా విస్తరించింది. తదనుగుణంగా సుశిక్షితులైన ఉద్యోగ బృంద అవసరం పెరిగింది. ఈ డిమాండ్‌ను తీర్చడం కోసం దేశ వ్యాప్తంగా పలు ప్రైవేట్, ప్రభుత్వ సంస్థలు డిప్లొమా, డిగ్రీ స్థాయిలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సును అందిస్తున్నాయి. ఇంటర్మీడియట్ పూర్తి చేసినవారు మూడు సంవత్సరాల డిప్లొమా ఇన్ హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదవవచ్చు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా దీనిలో ప్రవేశం ఉంటుంది. నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ కేటరింగ్ టెక్నాలజీ,న్యూఢిల్లీ పలు హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులను అందిస్తోంది. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి హోటల్ మేనేజెమెంట్, ఆతిధ్య రంగాల్లో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయి. చక్కని కమ్యూనికేషన్ స్కిల్స్, మేనరిజం, సేల్స్ పట్ల ఆసక్తి గల యువత ఈ రంగంలో శరవేగంగా అభివృద్ధి చెందవచ్చు. ఈ రంగంలో అనుభవం సంపాదించిన ఔత్సాహికులు సొంత బిజినెస్ ప్రారంభించవచ్చు. వివరాలకు www.nchmt.org వెబ్ సైట్‌ను చూడండి.



**టూరిజం ....**

విదేశీ మారక ద్రవ్యాన్ని చేకూరుస్తున్న ప్రధాన రంగాల్లో టూరిజం ఒకటి. మన దేశ భౌగోళిక స్థితులు, అంతర్జాతీయ గుర్తింపు పొందిన చారిత్రక సంపద విదేశీ పర్యటకులను ఆకర్షిస్తున్నాయి. ఐటి రంగంలో ఇండియా మంచి స్థితిలో ఉండటంతో పలు బహుళ జాతి సంస్థల తమ కార్యకలాపాలను ఇక్కడ నుండి నిర్వహించడం వల్ల ఆయా సంస్థల ప్రతినిధుల రెగ్యులర్ పర్యటనలు కూడా టూరిజం, హాస్పిటాలిటీ రంగాల అభివృద్ధి ఊపందుకుంటోంది. అందుచేత ఈ రంగంలో శిక్షితులైన గైడ్‌ల అవశ్యకత పెరిగింది. డిమాండ్‌కు తగ్గట్టుగా అనేక సంస్థలు టూరిజం అండ్ హాస్పిటాలిటీలో కోర్సులను నిర్వహిస్తున్నాయి. డిగ్రీ విద్యార్థులకు జాతీయ స్థాయిలో అలీగర్ యూనివర్సిటీ, బెనారస్ యూనివర్సిటీ వంటి పలు ప్రతిష్టాత్మక సంస్థలు ఎంబిఎ టూరిజం అండ్ హాస్పిటాలిటీ, అడ్వాన్స్‌డ్ హోటల్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌లో సర్టిఫికెట్, డిప్లొమా, గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులను అందిస్తున్నాయి. ఈ కోర్సులు పూర్తి చేసిన వారు ఆతిధేయ రంగంలో ఫ్రంట్ ఆఫీస్/బ్యాక్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్‌గానూ, టూరిజం గైడ్‌గానూ అనేక రంగాల్లో ఉపాధి పొందవచ్చు.

**లైబ్రరీ సైన్స్**

ఇంటర్మీడియట్ పాసైనవారికి లైబ్రరీ సైన్స్‌లో డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్ర పబ్లిక్ లైబ్రరీస్ డిపార్ట్‌మెంట్ ఈ కోర్సులను పర్యవేక్షిస్తుంది. శ్రీ కృష్ణ దేవరాయ యూనివర్సిటీ - అనంతపూర్ ఇంటర్మీడియట్ పాసైనవారికి ఆరు నెలల సర్టిఫికెట్ కోర్సును అందిస్తోంది. ఈ కోర్సు పూర్తి చేసిన వారు ప్రభుత్వ గ్రంథాలయాలలో లైబ్రేరియన్ ఉద్యోగానికి అర్హులు. లైబ్రరీ సైన్స్‌లో డిగ్రీ, పీజీ చేస్తే మరిన్ని ఉద్యోగావకాశాలుంటాయి. ఏపీపీఎస్సీ జూనియర్, డిగ్రీ కళాశాలలో లైబ్రేరియన్ పోస్టులను పోటీ పరిక్ష ద్వారా భర్తీ చేస్తోంది.

**కంప్యూటర్ కోర్సులు .....**

ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఎఐసిటిఇ) డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్ అక్రిడిటేషన్ ఆఫ్ కంప్యూటర్ కోర్సెస్ (డిఓఇఎసిసి) అనే సొసైటీని స్థాపించింది. ఇది దేశంలో కంప్యూటర్ కోర్సుల నాణ్యతా ప్రమాణాలను పర్యవేక్షించేందుకు నాలుగు స్థాయిలలో కోర్సులను రూపొం దించింది. అవి A లెవెల్ (ప్రాథమిక స్థాయి) B లెవెల్ (అడ్వాన్స్‌డ్ డిప్లొమా), C లెవెల్ (ఎంసిఎతో సమానమైనది), C లెవెల్ (ఎంటెక్‌తో సమానమైనది). ఈ కోర్సులు పూర్తి చేసిన వారు ప్రభుత్వ సంస్థల నియామాకలకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అంతేగాక పలు ప్రైవేటు సంస్థలు అందిస్తున్న ఎంఎస్ ఆఫీస్, డెస్క్ టాప్ పబ్లిషింగ్ (పేజ్‌మేకర్, ఫొటోషాప్), కంప్యూటర్ హార్డ్‌వేర్ వంటి షార్ట్ టర్మ్ కోర్సుల ద్వారా కూడా మీడియా, సాఫ్ట్‌వేర్, కళాశాలల్లో సంస్థలలో గ్రాఫిక్ డిజైనర్,కంప్యూటర్ ఆపరేటర్, హార్డ్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడవచ్చు. పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తూ విద్యార్హతలను మెరుగుపరచుకొని సొంత సంస్థలు స్థాపించి వ్యాపార రంగంలో కూడా రాణించవచ్చు. మరిన్ని వివరాలకు DOEACC సొసైటీ, ఎలక్ట్రానిక్స్ నికేతన్, రెండవ అంతస్థు, 6ఇఎ కాంప్లెక్స్, న్యూ ఢిల్లీ - 110003 చిరునామాను సంప్రదించండి.

**ఫారిన్ లాంగ్వేజెస్**

సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెంది ప్రపంచం ఒక కుగ్రామంగా మారిన తరుణంలో అనేక దేశాల మధ్య సంబంధాలకు ప్రాధాన్యత పెరిగింది. విద్య, వైద్య, ఆరోగ్యం, శాస్త్రీయ, ఆర్థిక, వాణిజ్య, పర్యాటక రంగాల్లో సంభవిస్తున్న ఆధునిక మార్పులను ప్రపంచ దేశాలు ఇచ్చిపుచ్చుకుంటున్నాయి. ఇతర దేశాల సమాచారాన్ని తెలుసుకోవాలన్నా, స్వదేశంలో మార్పులను విదేశీయులకు తెలియజేయాలన్నా విదేశీ భాషా పరిజ్ఞానం అవశ్యం. దౌత్యం వంటి విషయాల్లో ప్రాచీన కాలం నుండి ఆదరణ పొందుతున్న విదేశీ భాషలకు డిమాండ్ పెరిగింది. సర్టిఫికెట్, డిప్లొమా, డిగ్రీ, పీజీ, పిహెచ్‌డి స్థాయిల్లో అనేక యూనివర్సిటీలు విదేశీ భాషలను అందిస్తున్నాయి. వీటిలో హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజ్ యూనివర్సిటీ ఇష్లా ముందువరుసలో ఉంది. ఈ యూనివర్సిటీ అరబిక్, జర్మన్, ఫ్రెంచి, స్పానిష్, ఇంగ్లీష్ వంటి అనేక విదేశీ భాషలను ఆఫర్ చేస్తుంది. ఈ కోర్సులు పూర్తి చేసిన వారు దేశ, విదేశాల్లోని దౌత్య కార్యాలయాల్లో కళ్ళు చెదిరే ప్రారంభ వేతనంతో ఉపాధి పొందవచ్చు. ఇతర భాష ప్రచురణలు ప్రాంతీయ భాషల్లోకి అనువదించే ట్రాన్సలేటర్‌గా ఉపాధి పొందవచ్చు. చారిత్రక ప్రదేశాల పట్ల అవగాహన ఉన్న వ్యక్తులు విదేశీ పర్యాటకులకు గైడ్‌గా వ్యవహరించవచ్చు. ఉస్మానియా యూనివర్సిటీ, బెనారస్ హిందూ యూనివర్సిటీ, జవహర్‌లాల్ నెహ్రూ వర్సిటీ వంటి ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాలు కూడా విదేశీ భాషలకు చెందిన కోర్సులను అందిస్తున్నాయి. ఇండియన్ ఫారిన్ సర్వీస్ ద్వారా ప్రభుత్వ సర్వీసుల్లో కూడా ప్రవేశించి విదేశీ వ్యవహారాల కార్యదర్శి స్థాయికి ఎదగవచ్చు. బహుళ జాతి సంస్థల్లో ట్రాన్సలేటర్ గా ఉపాధి పొందవచ్చు.

**ఫ్యాషన్ టెక్నాలజీ...**

ఇటీవల కాలంలో యువత ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సులపై మక్కువ చూపిస్తున్నారు. హైదరాబాద్‌లో గల నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ ఇంటర్ విద్యార్థులకు బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సులను నిర్వహిస్తోంది. దీనిలో యాక్సెసరీస్, ఫ్యాషన్ కమ్యూనికేషన్, టెక్స్‌టైల్ డిజైన్ వంటి పలు స్పెషలైజేషన్లు ఉన్నాయి. ఈ కోర్సులకు సంబంధించి మరింత సమాచారం కోసం హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో గల నిఫ్ట్ క్యాంపస్‌ను సంప్రదించండి. లేదా www.nift.ac.in వెబ్‌సైట్‌ను చూడండి.

**ఎన్‌డీఏ,ఎన్‌ఏ...**

యుపీఎస్సీ ఎన్‌డిఎ/ఎన్‌ఎ, స్పెషల్‌క్లాస్ రైల్వే అప్రెంటీస్ ద్వారా ఇంటర్ విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించి ఇంజనీరింగ్ విద్య నందించడంతో పాటు ప్రభుత్వ రంగంలో ఉపాధి కల్పిస్తోంది. నేవల్ వింగ్‌లో ఉపాధి కోరుకునే అభ్యర్థులు ఏ గ్రూపుతోనైనా ఇంటర్; ఎన్‌డిఎ, ఎస్‌సిఆర్‌ఎలలో ఉపాధి పొందగోరు అభ్యర్థులు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జక్టులతో ఇంటర్ పూర్తి చేయాలి. ఎన్‌డిఎ, పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు ఇంజినీరింగ్, సైన్స్, ఆర్ట్స్ కోర్సులను అభ్యసించవచ్చు. త్రివిధ దళాల్లో లెఫ్టినెంట్, సబ్ లెఫ్టినెంట్ హోదాలో ఉపాధి లభిస్తుంది. ఎస్‌సిఆర్‌ఎ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారు బిట్ మెస్రాలో మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సును పూర్తి చేసి రైల్వేలో ఉపాది పొందుతారు. ఈ సంస్థలు ఎంపికైన అభ్యర్థులకు స్టైఫండ్ కూడా అందిస్తున్నాయి.







నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు,

## ఘనంగా మాజీ ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి వేడుకలు

**ఆలూరు,మేజర్ న్యూస్...** భారతదేశ మొదటి ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి వేడుకలు ఆలూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆలూరు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆరకట్ల నవీన్ కిషోర్ ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం ఎన్నో ఉద్యమాలు చేసి మహాత్మ గాంధీ వెంట నడిచి బ్రిటీష్ వారికి ఎదురొడ్డి నిలిచిన నాయకులు నెహ్రూ అని భారత దేశానికి మొట్టమొదటి ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టి ఎన్నో ప్రాజెక్టులు నిర్మించి రైతులకు అండగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి చిప్పగిరి లక్షినారాయణ, సిపిఎం,సిపిఐ నాయకులు హనుమంతు,కృష్ణ,షాకిర్, సంపత్,మారెప్ప కాంగ్రెస్ నాయకులు పాల్గొనడం జరిగింది.

## టిడిపి గెలుపును ఆకాంక్షిస్తూ కాలభైరవుడికి పూజలు..

**ఆళ్లగడ్డ , మేజర్ న్యూస్ :** మండలం పాత కందుకూరు గ్రామంలో వెలసిన కాలభైరవ స్వామి సన్నిధి నందు స్వామికి ఆళ్లగడ్డ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమా అఖిలప్రియ రెడ్డి గెలుపు ఆకాంక్షిస్తూ బూత్ కన్వీనర్ మరియు తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు సోమ వారం నిర్వహించారు ఈ సందర్భంగా కన్వీనర్స్ మాట్లాడుతూ కాలభైరవ స్వామి,కాళికామాత అమ్మవార్ల ఆశీస్సులతో పాటు ప్రజల ఆశీర్వాదంతో అత్యధిక మెజార్టీతో గెలుపొందాలని అదేవిధంగా రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని వారు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు అన్నారు. ఈ కార్యక్రమంలోటిడిపి నాయకులు మాజీ జడ్పీటీసీ సుద్దపల్లె చాంద్ బాషా. బూత్ కన్వీనర్స్ సగిలి శ్రీనివాసరెడ్డి. బి.వి భాస్కర్ యాదవ్ . వెంకటరామిరెడ్డి. కే రామాచారి. హెూటల్ శీను. మాజీ కౌన్సిలర్ సూలం నరసింహుడు. తెలుగుదేశం పార్టీ నాయకులు బాలీశ్వర్ రెడ్డి. లక్ష్మీ నరసయ్య, బాణాల గోపాల చారి, కృష్ణమాచారి, రాఘవేంద్ర చారి లు పాల్గొన్నారు.



# బాలనాగిరెడ్డి మంత్రి పదవి వరించాలని పూజలు

- 4వ తేదిన కూటమి ఓటమి తప్పదు
- 9వ తేదిన రాష్ట్రానికి జగనన్న రెండోసారి సిఎం ప్రమాణం
- బాలనాగి రెడ్డి నాలుగో విజయం ఎవరి ఆపలేరు



**ఎమ్మిగనూరు ప్రతినిధి, మేజర్‌న్యూస్ (మంత్రాలయం) :** ఈనెల నాల్గవ తేదీన వెలుబడే ఎన్నికల ఫలితాల్లో బాబు కూటమి గల్లంతు కావడం ఖాయమని మంత్రాలయం సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య అన్నారు. రెండో సారి ముఖ్యమంత్రి గా వైఎస్. జగన్మోహన్ రెడ్డి 9వ తేదిన విశాఖ లో ప్రమాణ స్వీకారం చేయడమే ఆలస్యమని అన్నారు. నియోజకవర్గంలో 2009,2014,2019లో హ్యాట్రిక్ విజయం సాధించి మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఈ ఎన్నికల్లో నాల్గవ సారీ అత్యధిక మెజార్టీతో విజయం సాధించి రికార్డు సృష్టించబోతున్నారని అన్నారు. ఈ విజయాన్ని ఎవరు ఆపలేన్నారు. నాలుగవ విజయం అందుకొన్న బాలనాగి రెడ్డి కి వై. ఎస్. జగన్ మోహన్ రెడ్డి మంత్రి వర్గంలో పదవి వరించేలా ఆశీస్సులు ఉండాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలోని పాతవూరు లో వెలసిన శ్రీ రామలింగేశ్వర స్వామి, వీరభద్ర స్వామి, వెంకటేశ్వర స్వామి అలాగే గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం ముందు ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి జరిగింది అంటే ఆ ఘనత ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి కే దక్కుతుందని కొనియాడారు. పెండింగ్ లో ఉన్న పనులను కూడా ప వై. సీతారామిరెడ్డి , ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి , వై. ప్రదీప్ రెడ్డి వై. ధరణీ రెడ్డి నేతృత్వంలో అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి సభ్యులు కురువ మల్లికార్జున, సచివాలయ మండల కో కన్వీనర్ వీకేసి రాఘవేంద్ర ఆచారి, ఉప సర్పంచ్ లు హెూటల్ పరమేష్, వీరనాగప్ప, ఎంపీటీసీ సభ్యులు వెంకటేష్ శెట్టి, వార్డు సభ్యులు, సచివాలయ కో కన్వీనర్లు, గృహ సారథులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అన్ని వర్గాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మారెమ్మ గుడి వరకు రోడ్డును నిర్మించండి



నిరసన తెలుపుతున్న మండ్లెం గ్రామ ప్రజలు

**జూపాడుబంగ్లా, మేజర్ న్యూస్:** జూపాడుబంగ్లా మండలం మాండ్లెం గ్రామంలోని నేషనల్ హైవే నుండి మండ్లెం గ్రామంలోని మారెమ్మ గుడి వరకు రోడ్డును నిర్మించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ ఎల్.స్వాములు మాదిగ అధికారులను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్వాములు మాట్లాడుతూ హైవే రోడ్డుకు గ్రావెల్ మట్టి, బిల్క్ భారీ వాహనాలతో తోలడం వల్ల గ్రామాల్లో ఉండే మట్టిరోడ్లు చిందరవందరమై ప్రజలు నడవడానికి కూడా వీలు లేకుండా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నేషనల్ హైవే అధికారులు రోడ్లను మరమ్మతులు చేయకుండా అలాగే వదిలివేయడం వల్ల ప్రజలు నడవడానికి వీలు లేకుండా పోయిందన్నారు. ద్విచక్ర వాహనదారులు క్రిందపడి ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని వెంటనే కర్నూలు నుండి ఆత్మకూరు వరకు ఎక్కడెక్కడ అయితే నేషనల్ హైవేకి ఆనుకొని ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రోడ్లను వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. హైవే అధికారులు పనులు దక్కించుకున్న గుత్తేదారులకు చెప్పి రోడ్లు వేయించాలని ఆయన డిమాండ్ చేశారు. మండ్లెం గ్రామ ప్రజలను ఏకంచేసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండ్లెం గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



స్వామి పల్లకీసేవ దృశ్యం

## శ్రీ ఉమామహేశ్వరుల పల్లకిసేవ

**బనగానపల్లెరూరల్,న్యూస్‌:** యాగంటి ఉమామహేశ్వర స్వామి దేవస్థానం నందు సోమవారం సందర్భంగా పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. ప్రదోశకాల ప్రత్యేక పూజల అనంతరం స్వామి అమ్మవార్లను మండపం నుండి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి పల్లకీ నందు కూర్చోబెట్టి ప్రధాన ఆలయం చుట్టూ పల్లకీసేవను నిర్వహించడం జరిగింది. అనంతరం వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈ.వొ చంద్రశేఖర్ రెడ్డి, ఛైర్మెన్ బుచ్చిరెడ్డి, పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వర రెడ్డి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

# రెస్టారెంట్ల ఫుడ్ .. జీవితానికి బెడ్ రెస్ట్

(మొదటిపేజీ తరువాయి)




తలతల మెరిసే లైటింగ్ కనిపిస్తే చాలు వాలిపోవడం మన పని అనుకొంటారు.. అక్కడ నిలువ ఉంచిన పదార్థాలతో వంటలు చేసిన ఫుడ్ పాయిజన్ కు దారులు వేస్తున్నా అవేమి పట్టించుకోము.. ఆకలి అవురావురు మంటుంది తినేద్దాం అంటారు... ఆన్ లైన్ ఆర్డర్లు పెడితే అవి ఇంటికి చేరేలోపు ఎలాంటి తినుబండారం వస్తుందో కూడా అంతు పట్టడం లేదు అది తెలిసి కూడా ఆర్డర్ పెట్టేస్తాం.. నచ్చితే తింటాం.. నచ్చక పోతే డబ్బు ఎంత పోయింది అని చూడకుండా డస్ట్ బిన్ లో పారేస్తాం డబ్బు పోయినా ఆరోగ్యం దెబ్బతినెల ప్రజా ఆరోగ్యం గాలికి వదిలేసిన , రెస్టారెంట్ యజమానులపై చర్యలు తీసుకోకపోవడమే ప్రధాన కారణంగా చెప్పవచ్చు. అక్కడ రుచికరమైన ఆహారం అందించాలని యజమాన్యాల అనుకొంటే సరిపోదు వంట మనుషులు చేస్తున్న పని మరింత ఘోరంగా ఉంటుంది.. ఆపని గమనించాలి. ప్రతి వంటకంలో టేస్టింగ్ సాల్ట్ వేయడంతో మానవుని శరీరంలో క్యాన్సర్ కణాలు ఉత్పన్నమవుతాయని ప్రజా ఆరోగ్య సంస్థల హెచ్చరిస్తున్న ఏ వ్యాపారి పట్టించుకోకపోవడం మరింత దారుణం. ఇక ఈ మధ్యలో రెస్టారెంట్ డాబాల్లో సీ ఫుడ్ అందిస్తూ తిండి ప్రియుల కు రోగాలు అనే డేంజర్ బెల్ మోగుస్తున్నారు.. మన ఇంటి వంట వద్దు అనుకుని ఇలా బయట తినులకు అలవాటు పడిన వారందరూ ఆస్పత్రి పాలు అవ్వక తప్పడం లేదు.. ప్రస్తుత సమాజంలో హెూటల్లు రెస్టారెంట్లు.. కర్రీ పాయింట్లకు నెలకొన్న వ్యాపారం ఏ వ్యాపారంలో లేదు అన్నది నగ్న సత్యం.. అంతా కల్తీ అని తెలిసినా ఇంట్లో వంటలు మానుకొని బయట తిండికి అలవాటు పడ్డారు.. వారు ఏది వండినా ఈపూటకు సర్దుకొందాం అనే నానుడి ఉన్నంత వరకు వారి వ్యాపారానికి డోకా లేదు.. కానీ ఆలా భుజంపు పొట్టలో ఆరగింపు కాదు అని తెలిసి చేసే తప్పులు కదా.. ఓ 25 ఏళ్ల క్రితం లా ఇంటిలో కట్టెల పొయ్యి కాదు అంతా గ్యాస్ పోయిల వంటలు ఇక ఆలస్యం చెయ్యకనే వంటలు అవుతాయ్.. కానీ అంత ఓపిక ఎక్కడ అండి అంటే చాలు.. మనమోహం డాబాలు రెస్టారెంట్ల వైపు చూస్తుంది..

ఇలా జనం రాకతో ఆర్డర్లపై ఆర్థర్లు వస్తుంటే వారు వేసే మసాలాలు.. టేస్టింగ్ సాల్ట్.. వేడివేడిగా అలా వస్తే.. ఇలా ఆరగించి వస్తున్నారు.. ఇది అదునుగా చూసుకుని వ్యాపారులు ఎక్కడబడితే అక్కడ బ్రాంచ్ లు ఓపెన్ చేస్తున్నారు ఎక్కడ పడితే అక్కడ బ్రాంచీలు ఓపెన్ చేస్తున్నారు.. యాజమాన్యం ఎక్కడ ఉంటుంది.. ఇక్కడ ఎలా వండి పెడతారో తెలియదు ప్రశ్నిద్దాం అంటే మేనేజ్మెంట్ కుంటి సాకులు చెప్తుంది..

మరి ఎక్కువ మాట్లాడితే తినడానికి వచ్చారు తిని వెళ్ళండి అనే సమాధానంతో నెట్టేస్తారు.. ఇలా ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న వ్యాపారులతో ఫుడ్ సేఫ్టీ అధికారులు.. ప్రజారోగ్య అధికారులు నెలసరి మామూలు పెట్టుకున్నారు అని ఆరోపణలతో ఏ రెస్టారెంట్లను.. ఏ దాబాలను తనిఖీ చేసే పాపాన పోవడం లేదన్నది ప్రధాన ఆరోపణ.. ఇదిలా ఉండగా తాగినంత మందు పోసి.. తిండి ఎలా పెట్టినా తింటాడన్న నానుడి అక్కడ ప్రతినిత్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది .. ఇక డాబాల్లో అనుమతులు లేకున్నా మద్యం ప్రియులకు అక్కడ పండగ వాతావరణం కల్పిస్తారు.. ఇంత జరుగుతున్నా కూడా డాబాలపై పోలీస్, సెబ్ అధికారులు ఎందుకు దాడులు చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు.. ఎమ్మిగనూరులో ఇటీవల ఆదోని వాసులు ఏర్పాటుచేసిన ఓ రెస్టారెంట్లు అయితే పరిస్థితులు మరింత దారుణంగా ఉన్నాయి.. అక్కడికి చికెన్ ఆదోని నుండి యాజమాన్యం కొట్టి పంపిస్తుందిఅని తెలిసి వచ్చింది దాన్ని వారు రెస్టారెంట్ కి చేర్చే లోపు చాలా సమయం పడుతుంది.. అంతేకాక మటన్ తక్కువ ధరకు లభించే పెద్ద కడుబూరు మండలం చిన్న తుంబలం నుండి ఎమ్మిగనూరు రెస్టారెంట్ చేరుతుంది అని సమాచారం.. షీ ఫుడ్ కర్నూలు, గుంటూరు, విజయవాడ నుండి తెప్పించడంవారి వ్యాపార పద్ధతి.. అక్కడ వంట మనుషులంతా ఒరిస్సా ప్రాంతానికి చెందినవారు.. నార్త్ ఫుడ్ ఎలా చేయాలో తెలియక ఏదో వండేస్తున్నారు.. వినియోగదారులు తిని పెడుతున్నారు.. రోగాలు కొని తెచ్చుకుంటున్నారు.. అద్దాలమేడలో తిండి కదా ఎంత కమ్మగా ఉంటుందని వెళితే అంత అనారోగ్యం దరిచేరుతుందని తెలియదు పాపం.. ప్రజారోగ్యం దెబ్బతీస్తున్నాయి ఇలాంటి వ్యాపారాలపై కొరడా జులిపించాల్సి వుంది..

సూర్య
మంగళవారం | 28 మే 2024

# మద్యం ప్రియులు ఎటువైపు?

- జగన్ సర్కార్‌కు మద్యం ప్రియులు హ్యాండిస్తారా.... మరోసారి అండగా నిలుస్తారా..?
- మద్యపాన నిషేధం పేరుతో తెలియని తిక్క బ్రాండ్లు
- 2024 ఎన్నికలలో మందుబాబుల ఓటు ఎవరికి లాభం చేకూరనుంది..?



**డోన్, మేజర్‌న్యూస్ :** 2019 ఎన్నికల హామీలో భాగంగా అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మద్యపాన నిషేదం ఉంటుందని చెప్పిన జగన్‌మోహన్‌రెడ్డి, జరిగిన సార్వత్రిక ఎన్నికలలో అధికారంలోకి వచ్చాక, మద్యం ప్రియులకు భారిగానే షాకిచ్చిందనే చెప్పాలి. మద్యపాన నిషేదం మాటెరుగు... పాతబ్రాండ్లను తీసేసి, వాటి స్థానంలో మందుబాబులకు నోరుతిరగని మద్యం బ్రాండ్లను తీసుకొచ్చిన సంగతి రాష్ట్ర ప్రజలతోపాటు, మందుబాబులకు తెలిసిన విషయమే. అయితే అధికారంలోకి వచ్చాక అమలు చేస్తామన్న మద్యపాన నిషేదం మాట పక్కన పెట్టి నిత్యం అందుబాటులో ఉండే పాత బ్రాండ్ల స్థానంలో పేరు తెలియని మద్యం బ్రాండ్లను తీసుకొచ్చి మందుబాబుల జేబులకు చిల్లులు పెట్టే విధంగా అమాతం ధరలను పెంచేసింది. గతంలో రూ.70లకు లభించే చీప్ లిక్కర్ వైయస్ఆర్‌పార్టీ హయాంలో ధరలు పెంచేశారు. క్వాటర్ ధరను ఏకంగా కూ.200లకు పైగా పెంచేసింది జగన్ సర్కార్. నిత్యం మద్యానికి అలవాటు పడ్డ మద్యం ప్రియుల జేబులకు చిల్లులు పడ్డటైంది. పెంచినా సరే పాత బ్రాండ్లే ఉంటాయానుకుంటే వాటి స్థానంలో ఊరు, పేరు తెలియని కొత్త బ్రాండ్లు తీసుకురావడంతో మందుబాబులు బ్రాండ్ల పేర్లు మరచిపోయి, రూ.100, రూ.150, రూ.200, రూ.250ల మందు కావాలంటూ మద్యం షాపుల దగ్గర పరిపాటిగా మారిపోయింది. ఇక గడిచిన ఐదే ళ్ళ కాలంలో ఇదే తంతు కొనసాగడంతో మందుబాబులు చేసేదేమిలేక ఏకంగా జే బ్రాండ్లు అంటూ వాటికి పేర్లు పెట్టేసుకున్నారు.

అయితే 2024 ఎన్నికలలో మద్యం ప్రియులు ఎవ్వరికి, ఏ పార్టీకి ఓటు వేశారో అనే సందేహంలో ఇరు పార్టీల నాయకులు సమాలోచనలో పడ్డారు. ఇటు కూటమి నాయకులు మాత్రం మద్యపాన నిషేదం ఎక్కడా అంటూ ఎన్నికల ప్రచారంలో ఊదర గొట్టారు. పాత బ్రాండ్లను తొలగించి వాటి స్థానంలో జే(జగన్) బ్రాండ్లను తీసుకొచ్చారంటూ ప్రచారాలు కొనసాగించారు. తక్కువ ధరలు ఉన్న మద్యాన్ని జగన్ సర్కార్ అమాంతం పెంచేసి, మద్యం ప్రియులకు గడ్డు కాలాన్ని తీసుకొచ్చారంటూ ప్రజల బుర్రలు తినేశారు. ఖచ్చితంగా మందుబాబుల ఓట్లు అన్ని కూటమికే పడ్డాయని కూటమి నాయకులు, అదేమిలేదు మద్యం ప్రియుల కుటుంబాల సంక్షేమం కోసమే మద్యం రేట్లు పెంచామని, అందుకనే మాకే ఓటు వేశారంటూ వైకాపా నాయకులు ఎవ్వరికి వారే ధీమాను వ్యక్తం చేసు కుంటున్నారు. తీరా మే 13వ తేదిన జరిగిన సార్వత్రిక ఎన్నికలలో మద్యం ప్రియులు ఎవ్వరికి ఓటు వేశారో తెలియక ఇరు పార్టీలు గందరగోళంలో ఉండిపోయారు.

# భారతదేశం హిందూ దేశం

## – శారద పీఠం స్వామి శ్రీ శివయోగీంద్ర భారతి

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:** భారతదేశం హిందూ దేశమని శారదపీఠం(కొలనుభారతి)స్వామి శ్రీ శివయోగీంద్ర భారతి అన్నారు. సోమవారం నగరంలోని మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో దక్షిణాంధ్రప్రదేశ్ బజరంగ్‌దళ్ కార్యకర్తల శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఈ శిక్షణా శిబిరం వచ్చే నెల 2వతేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ రామరాజ్యం స్థాపన కోసం హిందూ యువకులు పూనుకోవాలన్నారు. శిక్షణ పొంది సమాజంలోని హిందూత్వానికి రక్షణ ఉండాలన్నారు. బజరంగ్‌దళ్ భాగ్యనగర్ క్షేత్ర కన్వీనర్ వీరకుమార్‌స్వామి మాట్లాడుతూ దేశం కోసం, ధర్మం కోసం, సురక్ష సంస్కా అనే ధ్యేయ వ్యాఖ్యాలతో విశ్వహిందూ పరిషత్ ఏర్పడిందన్నారు. అయోధ్య రామ జన్మభూమి ఉద్యమంలో విశ్వహిందూ పరిషత్ కీలక పాత్ర పోషించిందన్నారు. హిందువులపై జరిగే దాడులను హిందూ యువకులు ఎదుర్కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్‌నాయకులు శ్రీనివాసరెడ్డి, దక్షిణాంధ్రప్రదేశ్ బజరంగ్‌దళ్ కన్వీనర్ తూముకుంట ప్రతాప్‌రెడ్డి, కో-కన్వీనర్ పోలేపల్లి సందీప్, కోశాధికారి సందడి మహేశ్వర్, సహసేవా కన్వీనర్ గురుమూర్తి, బజరంగ్‌దళ్ రాష్ట్ర విభగం సభ్యులు రవి, పెంచలయ్య, కమ్మయ్య, పిచ్చయ్యచౌదరి, శశికుమార్, కర్నూలు జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, కార్యదర్శి మాళిగి భానుప్రకాష్, సహకార్యదర్శి గూడూరు గిరిబాబు, గోవిందరాజులు, జిల్లా బజరంగ్‌దళ్ కన్వీనర్ రాజేష్, నగర అధ్యక్షుడు టి.సి.మద్దిలేటి, ప్రఖండ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీ శివయోగీంద్ర భారతి

# మంత్రాలయం లాడ్జిల్లో పోలీసుల సోదాలు

- రికార్డులు తనిఖీలు.. రూములలో విచారణ
- లాడ్జి యజమానులకు గుత్తేదార్లకు హెచ్చరికలు
- ఎస్సై గోపీనాథ్ ఆధ్వర్యంలో బృందాలు తనిఖీ

సూర్య ఎఫెక్ట్

**ఎమ్మిగనూరుప్రతినిధి, మేజర్‌న్యూస్ :** మంత్రాలయం వసతి గృహాల్లో అక్రమాలు.. ఆక్రమణ కట్టడాలు.. నిబంధనలు ఉల్లంఘన.. రేటు సపరేటు అనే అంశాలను కూర్చి నేటి దినపత్రిక సూర్య అందిస్తున్న వరుస కథనాలపై మంత్రాలయం ఎస్సై గోపీనాథ్ మంత్రాలయంలో ఉన్న లాడ్జిలు అన్ని రెండు రోజులుగా సోదాలు చేపట్టారు.. వారు అధికంగాఅద్దె లు వసూలు చేసిన విషయంపై ఆరా తీశారు.. అంతేకాక ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరికలు జారీ చేశారు.. లాడ్జింగ్ లలో అసాంఘిక శక్తులకు తవిస్తే ఉపేక్షించే ప్రశ్నలేదనే హెచ్చరించారు.. రాఘవేంద్ర స్వామి భక్తులకు ఎక్కడైనా ఇబ్బంది కలిగితే తగిన చర్యలు తీసుకుంటామన్నారు.. బృందలగా విభజించి ప్రతి రూము జల్లెడ పట్టి బృందలుగా తనిఖీలు చేపట్టామని ఆయన వెల్లడించారు, లాడ్జింగ్ లో అద్దె తీసుకునేవారు వివరాలను క్షుణ్ణంగా రికార్డులను తయారు చేయాలని ఏ సమయంలో రైడింగ్ జరిగిన వారి వివరాలు పూర్తిగా ఉండాలన్నారు.. రాఘవేంద్ర స్వామి సర్కిల్ నుండి ట్రాఫిక్ అంతరాయం ఉన్న సంగతి గ్రహించి వాహనాలను పార్కింగ్ ప్లేస్ లకు పరిమితం చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా ప్రయాణికులను రైల్వే స్టేషన్ కు మంత్రాలయం చుట్టుప్రక్కల చూడదగ్గ ప్రదేశాలను భక్తులు చుట్టేయడానికి వెసులుబాటు ఇస్తున్న ఆటోలను శ్రీ మఠం ప్రాంగణం వరకు వెళ్లకూడదని ప్రతి ఆటో డ్రైవర్ కు వివరించారు ఆలా వెళ్లి భక్తులకు ఇబ్బందులు కలిగిస్తే ఉపేక్షించమన్నారు.. రాఘవేంద్ర సర్కిల్ దగ్గర ఉండి ప్రయాణికులను గమ్యస్థానం చేర్చేందుకు ఆటోలు ఇక్కడే ఉండాలన్నారు మంత్రాలయంలో ఆలయం నిబంధనలకు విరుద్ధంగా ఏ లాంటి చర్యలు చేపట్టిన, ఎంతటి వారైనా కేసులు పెట్టడం జరుగుతుందన్నారు. పవిత్ర పుణ్యక్షేత్రం పరిసర ప్రాంతాల్లో వున్న వసతి భవనాల్లో ఎలాంటి అపవిత్రమైన పనులు చేసిన లాడ్జి యజమానులపై, గుత్తేదారులపైనే కాకా ఇందులో దళారు వ్యవస్థ నడుపుతున్న వారికి కూడా గుణపాఠం చెప్పడం జరుగుతుందన్నారు


రికార్డులు తనిఖీ చేస్తున్న దృశ్యం


లాడ్జిలలో సోదాలు చేస్తున్న ఎస్సై గోపీనాథ్ బృందం

# టోకెన్ విధానం ఉండేలా చర్యలు చేపట్టండి

## – జిల్లా కలెక్టర్/ జిల్లా ఎన్నికల అధికారి జి.సృజన

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** మొబైల్ డిపాజిట్ సెంటర్‌లలో టోకెన్ సిస్టమ్ ఉండే విధంగా చర్యలు చేపట్టడంతోపాటు క్యాంపస్‌లో, కౌంటింగ్ హాల్‌లో అదనపు లైటింగ్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్/జిల్లా ఎన్నికల అధికారి జి.సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రాయలసీమ యూనివర్సిటీలోని కంట్రోల్ రూమ్‌లో స్ట్రాంగ్ రూమ్ లైవ్ ఫీడ్‌ను పరిశీలించిన అనంతరం ఈవీఎం యంత్రాలను భద్రపరచిన ఇంజనీరింగ్ బ్లాక్‌ను, కౌంటింగ్ హాల్‌ను జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ రోజున ఎక్కువ సమయం పడుతుందని, అందుకుగాను రాయలసీమ యూనివర్సిటీలోని పార్కింగ్ ప్రదేశంలో, యూనివర్సిటీ మొత్తం అదనపు లైటింగ్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ మెటీరియల్ సంబంధిత రిటర్నింగ్ అధికారులకు హ్యాండోవర్ చేశారా? లేదా? అని డ్వామా పీడీని కలెక్టర్ ఆరా తీశబూరు. మొబైల్ డిపాజిట్ సెంటర్, ఫుడ్ కౌంటర్, తాగునీరు, ఏజెంట్ ఐడెంటిఫికేషన్ కౌంట్ల ఏర్పాట్లు పనులు ఎంతవరకు వచ్చాయని సంబంధితాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగబాబు, డీఆర్వో మధుసూదన్‌రావు, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి, డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ నాగరాజు పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న దృశ్యం

## పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి

# కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి : జేసీ మౌర్య

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని పాణ్యం నియోజకవర్గ ఆర్వో/ జిల్లా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అన్నారు. సోమవారం రాయలసీమ యూనివర్సిటీలో పాణ్యం నియోజక వర్గానికి సంబంధించి ఇంజనీరింగ్ బ్లాక్‌లోని స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ కౌంటింగ్ రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పకడ్బందీ ఏర్పాటు చేయడంతోపాటు సీసీ కెమెరాల పర్యవేక్షణలో పూర్తి ప్రక్రియను పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ కేంద్రంలోని మొబైల్‌ఫోన్ల్లు అనుమతి ఉండదన్నారు. ఆమె వెంట కల్లూ తహసీల్దార్ మునివేలు, ఆర్‌అండ్‌బీ డీఈ భారతి ఉన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

# భోగేశ్వరంలో శివునికి ప్రత్యేక పూజలు

**గడివేముల, మేజర్‌న్యూస్ :** దక్షిణగగా పేరుపొందిన శ్రీ దుర్గా భోగేశ్వర స్వామి దేవస్థానం నందు సోమవారం నాడు మండల బీసీ సెల్ అధ్యక్షులు కృష్ణయాదవ్, తెలుగుదేశం, జనసేన, బీజేపి పార్టీకి చెందిన కూటమి అధికారంలోకి రావాలని ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేయాలని పాణ్యం నియోజకవర్గం నుండి గౌరు చరితరెడ్డి గెలుపొందాలని శివునికి ప్రత్యేక పూజలు అభిషేకం, కుంకుమార్చనలు నిర్వహించారు.


శివునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మండల బీసీసెల్ అధ్యక్షులు కృష్ణయాదవ్